



www.vishalabharati.com
epaper:vishalabharati.com

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం | 11.05.2024 | హైదరాబాద్





## సొంత రాష్ట్రంలో మోడీకి ఎదురీతే

మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లో1995 నుంచి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ, గత రెండుసార్లు ఆ రాష్ట్రంలో మొత్తానికి మొత్తం లోక్‌సభ సీట్లు కైవసం చేసుకున్న పార్టీకి ఈసారి కష్టాలు తప్పేలా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గుజరాత్ నమూనాతోనే అధికారంలోకి వచ్చిన బీజేపీ.. మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ) తొలి పది స్థానాల్లోనూ గుజరాత్ లేదన్న కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ ఎత్తిచూపారు. మోదీ నమూనా పోయి అక్కడ ఇప్పటికీ కులం, మతం ఆధారంగానే ఓట్లు అడిగే పరిస్థితిలోనే ఉందని కాంగ్రెస్ ప్రచారం ప్రజల్లో మంచి ఫలితాలను ఇస్తుంది. కర్ణాటకలో 28 స్థానాలుండగా రెండో ఫేజ్‌లో 14 స్థానాలకు పోలింగ్ జరగగా.. మూడో ఫేజ్‌లో మిగిలిన స్థానాలకు పోలింగ్ జరిగింది. గత ఎన్నికల్లో 25 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. పార్టీలో సీనియర్ నేతల మధ్య అంతర్గత విభేదాలతో లోక్‌సభ ఎన్నికల్లో గెలువడం కష్టమేనని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపులు, ఆయన దౌత్య పాస్‌పోర్ట్‌తోనే దేశం విడిచి వెళ్లడం బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు తెచ్చిపెట్టాయి. ఈ పరిణామాలు ఎక్కడ బీజేపీ పుట్టి ముంచుతాయోనన్న కలవరం ఆ పార్టీ నేతల్లో ఉన్నది. ప్రజ్వల్ ఉదంతం బీజేపీ జేడీఎస్ ఓటు బ్యాంకుపై కచ్చితంగా ప్రభావం చూపిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

# ‘ఇండియా’ కే జనం జై..!

- బీజేపీకి ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ చెక్
- మొదటి మూడు విడతల్లో ఇండియా కూటమికే ఆధిక్యం
- సార్వత్రిక ఎన్నికల సమరంలో కొనసాగుతున్న కాంగ్రెస్ హవా
- పోలింగ్ తక్కువైనా ఫలితాలు మాత్రం ‘ఇండియా’కు అనుకూలం
- బీజేపీకి పలు రాష్ట్రాల్లో ఎదురుదెబ్బ
- జూన్ 4 తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం
- ఎన్డీఏ కూటమికి గతంలో వచ్చిన సీట్లు కూడా దక్కడం కష్టమే
- రానున్న నాలుగో విడత ఎన్నికల్లో కాంగ్రెస్‌కే అత్యధిక స్థానాలు

## పలు రాష్ట్రాల్లో క్లీన్‌స్వీప్

మొదటి మూడు విడతల్లోనే కర్ణాటక, తమిళనాడు, కేరళలోని అన్ని స్థానాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ మూడు రాష్ట్రాల్లో కలిపి 87 స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో తమిళనాడు, కేరళలో ఇండియా కూటమి పక్షాలు ఎక్కువ సీట్లు గెలవగా.. ఎన్డీయే కూటమి కర్ణాటకలో మాత్రమే ప్రభావం చూపించింది. ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు జరిగినట్లు తెలుస్తోంది. కర్ణాటక, తమిళనాడు, కేరళలోని మొత్తం స్థానాలతో పాటు మహారాష్ట్రలో 48 స్థానాలకు గానూ 24 స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. 112 స్థానాల్లో కాంగ్రెస్ ఇండియా కూటమి కనీసం వంద స్థానాలకుపైగా గెలుచుకోగలుగుతుందని అంచనా వేస్తున్నారు. కేరళ, తమిళనాడులో కలిపి 59 స్థానాల్లో క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని హస్తం పార్టీ అంచనా వేస్తోంది. మూడు విడతల్లో కలిపి దాదాపు 150 సీట్లు సాధిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే ఇండియా కూటమి మరో నాలుగు విడతల్లో జరగనున్న 260 స్థానాల్లో 100 నుంచి 120 స్థానాలు గెలుచుకుంటే అధికారంలోకి రావొచ్చని అంచనా వేస్తున్నారు.

## తెలంగాణలో డబుల్ డిజిట్ పక్కా

నాలుగు, ఐదు, ఆరు, ఏడు విడతల్లో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల జాబితాలో జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోనే 54 స్థానాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 25 స్థానాలు ఉండగా.. ఇక్కడ టీడీపీతో కలిసి బీజేపీ పోటీచేస్తోంది. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతుండగా డబుల్ డిజిట్ సాధిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కనీసం 10 నుంచి 13 స్థానాలు తప్పకుండా సాధిస్తామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





దేశ సార్వత్రిక ఎన్నికల సమరంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి దూసుకుపోతుంది. జూన్ 4 తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టేది తామేనని ధీమాగా చెబుతుంది. ఇప్పటికే మూడు విడతల్లో సగానికి పైగా లోక్‌సభ స్థానాల్లోఎన్నికలు పూర్తయ్యాయి. మొదటి మూడు విడతల్లో ఇండియా కూటమి ఆధిక్యం సాధిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మొదటి మూడు విడతల్లో పోలింగ్ తక్కువ నమోదైన, ఫలితాలు మాత్రం కూటమికి అనుకూలంటా ఉంటుందని అంటున్నారు. బీజేపీకి ఈ మూడు విడతల్లో ఎదురుదెబ్బ తగిలిందని ఇండియా కూటమి నమ్మకంగా ఉంది. ఎన్డీఏ కూటమికి గతంలో వచ్చిన సీట్లు రావంటూ ఇండియా టీం నేతలు చెబుతున్నారు. ఈ మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని, రానున్న నాలుగు విడతల ఎన్నికల్లో తెలంగాణ తోసహా మిగతా చోట్ల ఎక్కువ మొత్తంలో సీట్లు గెలిచి కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకుంటామని ఇండియా కూటమి నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- విశాలభారతీ, స్టేట్ బ్యూరో

## బీజేపీకి ఉక్కిరి బిక్కిరి

కీలకమైన మహారాష్ట్రలో 11 చోట్ల, యూపీలో 10 చోట్ల, బీహార్‌లో 7, ఛత్తీస్‌గఢ్‌లో 7, బెంగాల్‌లో 4 చోట్ల పోలింగ్ జరిగింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎన్సీపీ (శరద్‌పవార్) శివసేన (యూబీటీ) కూటమి మహా వికాస్ అఘాడీ, బీహార్‌లో ఆర్జేడీ కాంగ్రెస్‌ల మహా ఘట్‌బంధన్, యూపీలో ఎస్పీ కాంగ్రెస్‌ల కూటమి నుంచి బీజేపీకి సవాల్ ఎదురవుతున్నదని పరిశీలకులు అంటున్నారు. బెంగాల్‌లో అధికార తృణమూల్‌తో పాటు కాంగ్రెస్ వామపక్షాల కూటమి బలంగా ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు జట్టుకట్టి స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాయి. కాంగ్రెస్, వామపక్ష కూటమి బలం పుంజుకోవడం తృణమూలతోపాటు ప్రధానంగా బీజేపీకి పెద్ద తలనొప్పిగా మారింది.

## సౌత్‌లో మళ్లీ మోడీకి షాకే..

ఉత్తర భారతదేశంలో పరిస్థితిని అంచనా వేసిన కారణంగానే ప్రధాని దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించడానికి పదే పదే పర్యటిస్తూ ప్రయత్నం చేశారని విశ్లేషకులు చెబుతున్నారు. ఏపీలో 6 చోట్ల, తెలంగాణలో 17 చోట్ల ఆ పార్టీ పోటీ చేస్తున్నది. వీటికి మే 13న పోలింగ్ జరగనున్నది. బీజేపీ పోటీ చేస్తున్న 23 చోట్ల ఎన్ని గెలుచుకుంటుంది? తెలంగాణలో గతంలో గెలిచిన 4 సీట్లను నిలబెట్టుకోగలదా? అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి.రాష్ట్రంలో బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాకే బీజేపీ బలం పెరిగిందనే వాదన ఉన్నది. ఇవాళ ఆయన గెలుపు కోసం తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వచ్చి ప్రచారం చేయాల్సి వచ్చింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోసం మాజీ గవర్నర్ తమిళి సై రావాల్సి వచ్చింది. తెలంగాణలో ప్రధాని, అమిత్‌షా, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సహా కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు వచ్చారు. కానీ ఆ పార్టీ కచ్చితంగా ఈ సీట్లలో గెలుస్తుంది అని చెప్పలేని పరిస్థితిలో ఉన్నది.

## బీఆర్ఎస్ ఢమాల్.. పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే..

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఏ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయన్న చర్చ జరుగుతున్నది. 2018లో బీఆర్ఎస్ 119 స్థానాలకు 88 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ నాలుగు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 9 స్థానాలకే పరిమితమైంది. 2014లో 63 అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్నప్పుడే 11 లోక్‌సభ సీట్లలో విజయకేతనం ఎగురవేసింది. గెలుచుకున్న 11 సీట్లనే తిరిగి నిలబెట్టుకోలేకపోయింది. ఈసారి కోల్పోయిన సీట్లు కేసీఆర్‌కు షాక్ ఇచ్చినవి కావడం గమనార్హం.ఈసారి పదేళ్ల కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత, అనుకూలతలపై ప్రజల తీర్పు ఉంటుంది. ఐదు నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ప్రామాణికం అవుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుంచి బలమైన నేతలు వెళ్లిపోయారు. కనుక ఒకటి రెండు అంశాల ఆధారంగానే ఈ పార్టీకి సీట్లు వచ్చే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది. అసెంబ్లీలో విజయం సాధించిన తీరుగానే లోక్ సభ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమాగా ఉన్నారు. రాహుల్ గాంధీతో సహ కాంగ్రెస్ నేతల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడం దీనికి తిరుగులేని సాక్ష్యంగా నిలుస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.





## గెలుపుపై కాంగ్రెస్ ధీమా

అదే సమయంలో గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్ఘఢ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరాఖండ్, యూపీలో బీజేపీ బలంగా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీకి అధికంగా సీట్లు వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఈ రాష్ట్రాల్లో 127 స్థానాలు ఉన్నాయి. వీటిలో మెజారిటీ స్థానంలో గెలుస్తామని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే తమిళనాడులో ఎన్డీయే కూటమి 5 నుంచి 10 సీట్లు సాధిస్తుందని, కర్ణాటకలో 15కు పైగా సీట్లు వస్తాయని అంచనా వేస్తోంది. మిగతా రాష్ట్రాల్లో ఓ 10 సీట్లు గెలిచినా.. 130 నుంచి 140 వరకు గెలుస్తామనే ధీమాలో ఇండియా కూటమి నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. తరువాత నాలుగు విడతల్లో జరగనున్న 260 స్థానాల్లో కనీసం 150 స్థానాల్లో గెలిచినా అధికారానికి ఢోకా లేదని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు.